# ప్రజా మారుతి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 186  పేజీలు : 04  వెల రూ. 2  శుక్రవారం  09 - 01 - 2026




కువైట్‌లో డ్రగ్స్ దందా.. ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

# పేదలపై కక్షతోనే

## జాతీయ ఉపాధి హామీ పథకం మార్పు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మోదీ సర్కారుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేసేవారని ఆరోపణ
- కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని వెల్లడి
- మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తానంటే అంగీకరించేది లేదన్న ముఖ్యమంత్రి
- పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం



హైదరాబాద్ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు గెలుచుకుని ఉంటే రాజ్యాంగాన్నే మార్చివేసేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెజారిటీ ఉందన్న కారణంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర - మిగతా 2 లో

## దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చెయ్

- కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్
- ఖమ్మం జిల్లాలో పర్యటించిన కేటీఆర్
- ఖమ్మం జిల్లాలో గెలవడం మీ నాన్న వల్లే కాలేదని ఎద్దేవా
- మీ ఇంట్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని వ్యాఖ్య



హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చేయాలని సవాల్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చి గొప్పలు చెప్పడం మానుకోవాలని చెప్పారు. కేటీఆర్ ఖమ్మం జిల్లాలో పర్యటించిన సంగతి - మిగతా 2 లో


## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాంగ్రెస్ మంత్రులు

- కేసీఆర్‌ను మేడారం జాతరకు ఆహ్వానం పలికిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- బీఆర్ఎస్ అధినేత ఆత్మీయ పలకరింపు
- మేడారం జాతరకు ఆహ్వానం పలికేందుకు ఎర్రవెల్లికి చేరుకున్న మంత్రులు
- "బాగున్నారా అమ్మా" అని పలకరించిన కేసీఆర్
- మంత్రులకు అతిథి మర్యాదలతో పసుపు,కుంకుమ,చీర,తాంబూలాలతో కేసీఆర్ సత్కారం



2 లో

## ప్రజానాడి




## ఖాళీ అవుతున్న హైదరాబాద్



2 లో

కిటకిటలాడుతున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు పయనమవుతున్న జనాలు

జనసంద్రాన్ని తలపిస్తున్న రైల్వే స్టేషన్లు

ఇప్పటికే 150 ప్రత్యేక రైళ్లను అనౌన్స్ చేసిన దక్షిణ మధ్య రైల్వే

### వైఎస్సార్సీపీ కుట్రలను నేతలు

# సమర్థంగా తిప్పికొట్టాలి

- విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్
- టీడీపీ మంత్రులతో మంత్రి నారా లోకేశ్ అల్పాహార విందు భేటీ
- ప్రజావేదికలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి మంత్రులు బాధ్యత తీసుకోవాలన్న మంత్రి
- తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి చొరవ చూపాలి



అమరావతి : వైఎస్సార్సీపీ మాదిరి రప్పా రప్పా మన విధానం కాదని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. జగన్‌లా ప్రజల్ని భయపెట్టడం, బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటివి తెలుగుదేశం సంస్కృతి కాదని ఎద్దేవా చేశారు. ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం మంత్రులతో మంత్రి నారా లోకేశ్ అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన వారితో వివిధ అంశాలపై చర్చించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును - మిగతా 2 లో

### పిఠాపురంలో

## పవన్ కల్యాణ్ పర్యటన



- సంక్రాంతి సంబరాలకు శ్రీకారం
- పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మూడు రోజుల పర్యటన
- 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' పేరుతో వేడుకలు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- జిల్లాలో శాంతిభద్రతలపై అధికారులతో సమీక్షా సమావేశం
- మూడు రోజుల పాటు ఘనంగా తెలుగు సంస్కృతీ సంప్రదాయాల ప్రదర్శన

అమరావతి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన సొంత నియోజకవర్గంలో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల పాటు ఆయన పిఠాపురంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు, 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' - మిగతా 2 లో

# ఏపీ క్యాబినెట్ భేటీ

# కీలక నిర్ణయాలకు ఆమోదం!

- దాదాపు 35కు పైగా అజెండా అంశాలకు ఆమోదం
- ఏపీ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం
- ఏపీ క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు ఇవే!
- దాదాపు రూ. 200 కోట్లతో 45 ఎంఎస్ఎంఈ కామన్ ఫెసిలిటీ కేంద్రాల ద్వారా వచ్చే 5 ఏళ్లలో 500 మందికి ఉపాధి కల్పనే లక్ష్యం
- కోటబొమ్మాళిలో కొత్త ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమోదం
- 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల కిట్‌లు పంపిణీకి 944.53 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులు ఆమోదించనున్నారు
- 2015లో జీవో నెంబర్ 81 ద్వారా మంజూరు చేసిన 754 పోస్టుల ర్యాటిఫికేషన్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది



అమరావతి : దాదాపు 35కు పైగా అజెండా అంశాలను ఆమోదించేందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఏపీ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ఎంఎస్ఎంఈ పరిధిలో ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆమోదించినట్లు సమాచారం. దాదాపు రూ. 200 కోట్లతో 45 ఎంఎస్ఎంఈ కామన్ ఫెసిలిటీ కేంద్రాల ద్వారా వచ్చే 5 ఏళ్లలో 500 మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలు కానుంది. రాష్ట్రంలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో తీసుకున్న నిర్ణయాలను క్యాబినెట్‌లో ఆమోదించారు. బార్లలో అదనపు రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఉపసంహరణపై మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రువరీలు ఏర్పాటుకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదికపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## మెగా హైదరాబాద్
## వికేంద్రీకృత పాలనకు ఆటంకం



ఒక వైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను హరిస్తోందని గగ్గోలు పెడుతూ, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలే స్థానిక ప్రభుత్వాల అధికారాలను క్రమంగా కేంద్రీకరిస్తూ వికేంద్రీకరణ పాలనను దెబ్బతీయడం తీవ్రమైన చర్య. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేయడం మాత్రమే కాకుండా, అనేక గ్రామ పంచాయితీలను సమీప మునిసిపాలిటీల్లో కలపడం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.ఈ విలీనంపై అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా విధానపరమైన ప్రక్రియలు, నోటిఫికేషన్లు, వార్డు విభజనలు, జనాభా, పన్నుల సర్దుబాట్లు వంటి అంశాలపైనే చర్చిస్తున్నాయి. కానీ ప్రజాస్వామ్యాన్ని మరింత కేంద్రీకరించే ఈ విధాన దిశ సరైనదేనా? అనే ప్రశ్నను లేవనెత్తకపోవడం అత్యంత ఆందోళనకరం. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పిటిషనర్లు కూడా రాజ్యాంగ ఆత్మ, వికేంద్రీకరణ పాలన, స్థానిక స్వపరిపాలనపై దెబ్బ వంటి మౌలిక అంశాలను లేవనెత్తలేదు. రాజ్యాంగంలోని 73, 74 సవరణలు స్థానిక స్వపరిపాలనకు చట్టబద్ధమైన హోదా, అధికారాలు, బాధ్యతలు కల్పించాయి. అయితే రాష్ట్ర స్థాయిలో రాజకీయపరిపాలనా ప్రతిఘటనల వల్ల ఈ సవరణలు పూర్తిగా అమలుకావడం లేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వికేంద్రీకరణ పాలనకు విరుద్ధం. దాదాపు కోటి ముప్పై లక్షల జనాభాను ఒకే మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువచ్చి, నిర్ణయాధికారాలను మరింత కేంద్రీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇంత భారీ జనాభాకు ఒకే పరిపాలనా వ్యవస్థ ద్వారా సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన సాధ్యమా అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.దేశంలో వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యమని నిరూపించిన అనేక నమూనాలు ఉన్నాయి. అందులో కేరళ మోడల్ ముఖ్యమైనది. ఇటీవల కేరళ క్యాడర్‌కు చెందిన ఒక తెలుగు ఐఏఎస్ అధికారి కూడా, కేరళ అభివృద్ధికి ప్రధాన కారణం వికేంద్రీకరణ పాలనే అని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం 'సమగ్రాభివృద్ధి' పేరుతో ఈ విలీనాన్ని సమర్థించుకుంటోంది. ఇక్కడ కీలకమైన ప్రశ్న విలీనం చేయదలచుకున్న పట్టణ స్థానిక సంస్థల ప్రజల అభిప్రాయాలను తీసుకున్నారా? ఆయా మునిసిపాలిటీల సర్వసభ్య సమావేశాల్లో ఈ అంశంపై తీర్మానాలు జరిగాయా? శంకరపల్లి మున్సిపాలిటీలో చందిప్ప గ్రామ పంచాయతీ విలీనానికి వ్యతిరేకించి తమ స్థానిక పాలనను కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలోని వార్ధా పట్టణంలో ఒక గ్రామ పంచాయితీ, మునిసిపాలిటీలో విలీనాన్ని తిరస్కరించి స్వతంత్రంగా కొనసాగుతున్నది. మేము నిర్ణయాలు చేస్తాం మీరు అమలుపరచండి అనే ధోరణిని వ్యతిరేకిస్తూ చేసిందే 73, 74 రాజ్యాంగ సవరణ అని గుర్తించాలి.ఈ సవరణల ప్రధాన రూపకర్త రాజీవ్‌గాంధీ సంకల్పానికి, ఆయన కలగన్న స్థానిక స్వపరిపాలన బలోపేత లక్ష్యానికి ఈ విలీన చర్య వ్యతిరేకం. పౌరుల అవసరాలు, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు బలమైన స్థానిక ప్రభుత్వాల ద్వారానే సాధ్యం. ప్రతి అంశాన్ని కేవలం ఆర్థిక కోణంలో మాత్రమే చూడలేం. రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ముఖ్యమైన హక్కు పాలనలో భాగస్వామ్యం. ఎన్నికల సమయంలో ఓటు వేసే హక్కుతోనే పౌరులను పరిమితం చేసి, పాలనలో భాగస్వాములను చేయకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠం చేయడం ద్వారా కేరళ మానవవనరుల అభివృద్ధి సూచికల్లో అగ్రస్థానంలో నిలిచింది. అధిక అక్షరాస్యత, తక్కువ శిశు మరణాల రేట్లు, మెరుగైన ఆరోగ్యవిద్య సూచికలు మెరుగు పరచుకున్నారు. స్థానిక స్వపరిపాలన సంస్థలు ఆరోగ్యం, విద్య వంటి కీలక రంగాల్లో సేవలందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.అందుకే రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలను స్థానిక ప్రభుత్వాలకు తిరిగి బదలాయించాలి. స్థానిక ప్రభుత్వాలను మెగా హైదరాబాద్‌లో విలీనం చేయడం కాదు, వాటిని బలోపేతం చేయడమే మన ముందున్న మార్గం. ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల పట్ల పూర్తి విశ్వాసంతో, దృఢమైన రాజకీయ సంకల్పంతో కేరళ తరహా వికేంద్రీకరణ దిశగా తెలంగాణ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఏపీ క్యాబినెట్ భేటీ - పలు కీలక నిర్ణయాలకు ఆమోదం!



**మొదటిపేజీ తరువాయి** - గ్రామీణ ప్రాంతాల్లో జల్‌జీవన్ ద్వారా నీటి సరఫరాకు రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారెంటీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొత్త ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలపనున్నారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల కిట్‌లు పంపిణీకి 944.53 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులకు ఆమోదించనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సంప్రదాయేతర ఇంధన, విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటుకు ఆమోదించనున్నట్లు సమాచారం. సీఆర్డీయే అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలపనుంది. వివిధ సంస్థల భూకేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది.రాష్ట్రంలో మరో రూ.19,391 కోట్ల పెట్టుబడుల ద్వారా 11,753 ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనాలకు నేడు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో వివిధ పెట్టుబడులకు సంబంధించి మొత్తంగా 14 సంస్థల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. అమరావతిలో కృష్ణా తీరంలో మెరీనా ప్రాజెక్టు ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం లభించనున్నట్లు సమాచారం.2015లో జీవో నెంబర్ 81 ద్వారా మంజూరు చేసిన 754 పోస్టుల ర్యాటిఫికేషన్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. వాటిలో కొన్ని పోస్టుల్ని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, కొన్ని పోస్టుల్ని డిప్యుటేషన్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించుకునేందుకు ప్రభుత్వం అప్పుడే వెసులుబాటు కల్పించింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు కేటాయించిన వాణిజ్య స్థలాల్లో వీధిశూల ఉన్నవాటికి బదులు వేరే స్థలాల్ని కేటాయించే ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలపనుంది. పలు సంస్థలకు భూ కేటాయింపులతో పాటు ఇతర కీలక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం లభించనుంది.

# పిఠాపురంలో పవన్ కల్యాణ్ పర్యటన

**మొదటిపేజీ తరువాయి** - పేరుతో ముందస్తు సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. పర్యటన వివరాల ప్రకారం, గురువారం రాత్రికి పిఠాపురం చేరుకున్న పవన్ కల్యాణ్, ఉదయం 10:30 గంటలకు స్థానిక ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. కళాశాల మైదానంలో జరగనున్న సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 11:30 గంటలకు నియోజకవర్గంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఆ తర్వాత మహోత్సవ ప్రాంగణంలోని సాంస్కృతిక కార్యక్రమాలను, ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకిస్తారు. సాయంత్రం, ఇటీవల వర్షాలకు ముంపునకు గురైన పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలోని మోహన్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఇక తన పర్యటనలో రెండో రోజైన శనివారం ఉదయం, గొల్లప్రోలు మండలంలో పేదల కోసం కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి ఉదయం



10:30 గంటలకు కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుంటారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిపై పోలీసు ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు.పిఠాపురం వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న ఈ సంక్రాంతి మహోత్సవాలను రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.మొదటి రోజు (జనవరి 9) హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, జానపద గీతాలు, వీర నాట్యాలు, తప్పెట గుళ్ళు, గరగల నృత్యాలు, థింసా, లంబాడీ వంటి గిరిజన, సంప్రదాయ నృత్యాలతో పాటు కూచిపూడి, భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించనున్నాయి.రెండో రోజు (జనవరి 10)... తొలి రోజు ప్రదర్శనల కొనసాగింపుతో పాటు కేరళకు చెందిన సంప్రదాయ యుద్ధ కళల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇక చివరి రోజు (జనవరి 11) గ్రామీణ జానపద కళాకారుల పాటలు, సినీ మ్యూజికల్ నైట్‌తో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

# వైఎస్సార్సీపీ కుట్రలను నేతలు సమర్థంగా తిప్పికొట్టాలి

**మొదటిపేజీ తరువాయి** - గౌరవిస్తూ ఎంత మేర సేవ చేశామన్నదే తమ అజెండా కావాలని మంత్రులకు నారా లోకేశ్ సూచించారు. అభివృద్ధి- సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చామన్నదే కూటమి విధానమని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ కుట్రలను పార్లమెంటు వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలని మంత్రి లోకేశ్ పునరుద్ఘాటించారు. పార్లమెంట్ కేంద్రాల్లో నేతలు ఏకతాటిపై నడుస్తూ వైఎస్సార్సీపీ అసత్య ప్రచారాలకు దీటుగా బదులివ్వాలన్నారు. ప్రజావేదికలో తమకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా మంత్రులు బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని వివరించారు. పార్టీ మరింత బలోపేతమే లక్ష్యంగా క్యాడర్‌ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జి మంత్రులు పని చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టేవారిపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో జవాబుదారీతనం, పౌరుల రక్షణను బలోపేతం చేయడం అనే అంశంపై సచివాలయంలో నిర్వహించిన మంత్రుల బృంద సమావేశంలో బుధవారం మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఐటీ చట్టంలో ఇందుకు ఉన్న నిబంధనలపై చర్చించారు.ఇదిలా ఉండగా మరోవైపు బుధవారం విశాఖ వచ్చిన మంత్రి నారా లోకేశ్ నగర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మాట్లాడి, వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.జీవీఎంసీ 83వ వార్డు ఏఎంసీ కాలనీలో ఏళ్ల కిందట ప్రభుత్వం నిర్మించిన 192 గృహాలు శిథిలావస్థకు చేరాయని, వాటిని పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరారు. థలసీమియా బాధితులకు విశాఖలో కేర్ సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాయిం పుతో పాటు నిధులు మంజూరు చేయాలని విశాఖ కారుణ్య సేవా సంస్థ ప్రతినిధులు విన్నవించారు. ఏయూలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు నెలవారీ వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం. సురేష్ మీనన్ కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందించారు. దేవరాపల్లి మండలం ముషిడిపల్లిలో యాదవ సామాజికవర్గం ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, సామాజిక భవనం నిర్మించాలని గ్రామస్థులు



కోరారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గణబాబు, రామకృష్ణబాబు, కార్పొరేషన్ ఛైర్మన్లు సీతం రాజు సుధాకర్, గండి బాబ్జీ, పీవీజీ కుమార్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, విశాఖ లోక్‌సభ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు చోడె వెంకట పట్టాభిరామ్, పార్టీ నేతలు లొడగల కృష్ణ, కోరాడ రాజబాబు, పి. విజయకుమార్, బండారు అప్పలనాయుడు, బైరెడ్డి పోతనరెడ్డి, నాగజగదీశ్వరరావు, తోటరత్నం, గనగళ్ల సత్య తదితరులు మంత్రిని కలిశారు.

# ఖాళీ అవుతున్న హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి** - తెలంగాణలో పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో హైదరాబాద్ లో నివసిస్తున్న కుటుంబాలు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు పయనమవుతున్నాయి. ఉదయం నుంచే సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లకు ప్రయాణికులు పోటెత్తారు. సికింద్రాబాద్ స్టేషన్ అయితే పూర్తిగా రద్దీతో నిండిపోయింది. లగేజీలు, పిల్లలు, పెద్దలతో జనసంద్రం కనిపించింది.ఈ రద్దీని ముందుగానే అంచనా వేసిన దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే 150 స్పెషల్ ట్రైన్లను అనౌన్స్ చేసింది. ముఖ్యంగా విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, తిరుపతి వంటి ఏపీ ప్రాంతాలకు డిమాండ్ ఆకాశాన్నంటడంతో అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ స్టేషన్ పై ఒత్తిడి తగ్గించేందుకు... జనవరి 7 నుంచి 20 వరకు 27 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లలో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. దీనివల్ల ఐటీ కారిడార్‌లో ఉండే ఉద్యోగులు సికింద్రాబాద్ రాకుండా నేరుగా హైటెక్ సిటీలోనే రైలు ఎక్కే సౌకర్యం లభిస్తుంది, ఇది చాలా మందికి భారీ రిలీఫ్‌గా మారింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా ప్లాట్‌ఫామ్ 10 వైపు పార్కింగ్, ఎగ్జిట్ మార్గాలు మార్చారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా అదనపు సిబ్బంది, పోలీసు బలగాలను మోహరించారు. ఇక అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు తీసుకునేవాళ్లు 'రైల్ వన్' యాప్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే 3 శాతం డిస్కౌంట్ లభిస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

# పేదలపై కక్షతోనే జాతీయ ఉపాధి హామీకం మార్పు

**మొదటిపేజీ తరువాయి** - పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. మెజారిటీ ఉందన్న అహంకారంతో చట్టసభలను వినియోగించి పేదలను అణిచివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. అందుకే గత ఎన్నికల్లో 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజలను అప్రమత్తం చేయడంతో బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని ఆయన పేర్కొన్నారు. దీనితో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని ఆయన అన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకువచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాంగ్రెస్ మంత్రులు



**మొదటిపేజీ తరువాయి** - తెలంగాణ రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్కలను మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. తన నివాసానికి వచ్చిన మంత్రులను "బాగున్నారా అమ్మా" అని ఆయన అప్యాయంగా పలకరించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఆహ్వాన పత్రికను కేసీఆర్‌కు అందజేసేందుకు మంత్రులు ఎర్రవెల్లిలోని ఆయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. వారిని ఆయన మర్యాద పూర్వకంగా పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు.మంత్రులు కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను, ప్రసాదంను అందజేసి, మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న జాతరకు రావాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందును మంత్రులు స్వీకరించారు. అనంతరం వారు కేసీఆర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎర్రవెల్లి ఫామ్ హౌస్ వద్ద మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ స్వాగతం పలికారు.

# మళ్లీ చెన్నై రోడ్లపైకి డబుల్ డెక్కర్ బస్సులు

**మొదటిపేజీ తరువాయి** - చెన్నై మహానగర రోడ్లపై డబుల్ డెక్కర్ బస్సులు మళ్లీ సందడి చేయనున్నాయి. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, 20 ఏసీ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను నగరంలో ప్రవేశపెట్టేందుకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (మీజ) ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు గురువారం టెండర్లు ఆహ్వానించింది.ఈ బస్సులను గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ పద్ధతిలో సేకరించనున్నారు. దీని ప్రకారం, బస్సుల యాజమాన్యం, నిర్వహణ, ఆపరేషన్ అంతా కాంట్రాక్టు పొందిన ప్రైవేట్ సంస్థ చూసుకుంటుంది. బస్సులు నడిచిన కిలోమీటర్ల ఆధారంగా మీజ ఆ సంస్థకు డబ్బులు చెల్లిస్తుంది. అయితే, టికెట్ల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం మీజకే చెందుతుంది. ఆసక్తిగల సంస్థల కోసం జనవరి 13న ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించనున్నారు.ఈ డబుల్ డెక్కర్ బస్సులను నగరంలోని అన్ని రూట్లలో నడపబోవడంలేదు. వీటి ఎత్తు కారణంగా తక్కువ ఎత్తులో ఉండే వంతెనలు, ఫ్లైఓవర్లు, విద్యుత్ లైన్లు ఉన్న ప్రాంతాల్లో తిప్పడం సాధ్యం కాదు. అందుకే, మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఎంపిక చేసిన మార్గాల్లోనే వీటిని నడుపుతారు. ఇటీవల స్విచ్ మొబిలిటీకి చెందిన ఓ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెన్నై రోడ్లపై కనిపించడంతో, దానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.చెన్నై నగరానికి డబుల్ డెక్కర్ బస్సులతో పాత అనుబంధం ఉంది. 1970లలో తొలిసారిగా ప్రారంభమైన ఈ బస్సులు, 1997లో పునఃప్రారంభమై హైకోర్టుతాంబరం మార్గంలో 2008 వరకు నడిచాయి. ఆ తర్వాత వాటిని తొలగించారు. ఇప్పుడు మళ్లీ ఆధునిక, పర్యావరణ



హితమైన ఎలక్ట్రిక్ రూపంలో ఈ బస్సులను తీసుకువస్తున్నారు. ఇప్పటికే ముంబై, హైదరాబాద్, భువనేశ్వర్ వంటి నగరాల్లో ఇలాంటి ఏసీ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు నడుస్తున్నాయి.

# దమ్ముంటే ఖమ్మం జిల్లాలో పోటీ చెయ్

**మొదటిపేజీ తరువాయి** - తెలిసిందే. ఈ పర్యటనపై పొంగులేటి స్పందిస్తూ కేటీఆర్ పై విమర్శలు గుప్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గెలవడం మీ నాన్న తరం కాలేదు... నీ వల్ల ఏమవుతుందని అని అన్నారు. ముందు మీ ఇంట్లో ఉన్న సమస్యలను పరిష్కరించు కోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించారని పొంగులేటి మండిపడ్డారు. ప్రభుత్వం జోలికి వస్తే కాంగ్రెస్ పార్టీ పవర్ ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కేటీఆర్ మతి భ్రమించి రాహుల్ గాంధీ, గాంధీ కుటుంబంపై మాట్లాడుతున్నారని, సూర్యుడి పైకి ఉమ్మితే అది తిరిగి తన ముఖం మీదే పడుతుందని గమనిం



చాలని అన్నారు. అవినీతి, దోపిడీలకు పేటెంట్‌గా ఉన్న కల్వకుంట్ల ఫ్యామిలీ గాంధీ కుటుంబం గురించి మాట్లాడటం సరికాదని మండిపడ్డారు.జాతీయ నాయకుడిని విమర్శిస్తే తాను కూడా జాతీయ నాయకుడినవుతానని తాపత్రయపడటంలో తప్పులేదు కానీ ఆశకు హద్దు ఉండాలని అన్నారు. ఎన్నికల్లో వరుసగా దెబ్బలు తిన్నా బుద్ధి తెచ్చుకోకుండా అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు రెఫరెండం అని చెప్పిన ఎన్నికల్లోనే ప్రజలు గూబ గుయ్యిమనిపించారు. జూబ్లీహిల్స్, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. ఇప్పుడు రాబోయే మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్స్ అంటున్నారు... దేనికి సెమీ ఫైనల్?" అంటూ ప్రశ్నించారు.

# అమెరికా నౌకలను ముంచేస్తాం - రష్యా ఎంపీ వార్నింగ్

**వెనెజువెలాతో సంబంధముందంటూ రష్యా**
**జెండా కలిగిన ట్యాంకర్‌ను సీజ్ చేసిన అమెరికా**
**అవసరమైతే అమెరికా నౌకలను ముంచేస్తామన్న రష్యా ఎంపీ**


వెనెజువెలాతో సంబంధం ఉందంటూ, రష్యా జెండా కలిగిన ఆయిల్ ట్యాంకర్‌ను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో జరిగిన ఈ ఘటనపై రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా తీరు ఇలాగే కొనసాగితే, వారి కోస్ట్ గార్డ్ పడవలను టార్పిడోలతో ముంచివేయాల్సి వస్తుందని రష్యా చట్టసభ సభ్యుడు ఒకరు గట్టి హెచ్చరిక జారీ చేశారు.ఐస్‌లాండ్‌కు దక్షిణంగా 190 మైళ్ల దూరంలో 'మారినెరా' అనే రష్యన్ ట్యాంకర్‌ను అమెరికా రక్షణ శాఖ, కోస్ట్ గార్డ్ సంయుక్తంగా సీజ్ చేశాయి. ఈ ఆపరేషన్‌కు బ్రిటన్ కూడా సహకరించింది. హెలికాప్టర్ ద్వారా నౌకపైకి దిగిన అమెరికా మెరైన్లు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో, జెండా లేని 'ఎం/టీ సోఫియా' అనే మరో నౌకను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను యూఎస్ కోస్ట్ గార్డ్ విడుదల చేసింది.ఈ ఘటనపై రష్యా ఎంపీ అలెక్సీ జురావ్లెవ్ తీవ్రంగా స్పందించారు. "ఏం చేసినా శిక్ష పడదన్న ధీమాతో అమెరికా ఉంది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తే సైనిక దాడులకు సిద్ధంగా ఉండాలి. అవసరమైతే అమెరికా కోస్ట్ గార్డ్ పడవలను ముంచేయాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు. ఈ చర్యను 'సముద్రపు దోపిడీ' అని రష్యా అధికారులు అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ సముద్ర చట్టాలను ఉల్లంఘించడమేనని రష్యా రవాణా శాఖ ఖండించింది.వెనెజువెలా చమురు ఎగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలను అమలు



చేయడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆంక్షలను తప్పించుకోవడానికి వెనెజువెలా, ఇరాన్ వంటి దేశాలు ఉపయోగిస్తున్న 'షాడో ఫ్లీట్' నౌకలను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. ఈ తాజా ఘటనతో అమెరికా, రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# పురుగులు పట్టిన స్థితిలో మృతదేహం.. పోలీసులు దర్యాప్తు

**ముల్కనూర్ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం**



**భీమదేవరపల్లి జనవరి 8 (ప్రజా మంటలు) :** ముల్కనూర్ గ్రామ శివారులోని సమ్మక్క గుట్ట సమీపంలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమై స్థానికంగా కలకలం రేపింది. బుధవారం ఈ సంఘటన వెలుగులోకి రాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని వయస్సు సుమారు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతుని ఎడమ వైపు ఛాతీపై ఇంగ్లీష్‌లో "అమ్మ" అని పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం ధరించిన దుస్తులు నలుపు రంగు జీన్ ప్యాంటు, తెలుపు, పింక్ రంగుల ఫుల్ హ్యాండ్స్ చొక్కాగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి పురుగులు పట్టిన స్థితిలో ఉండటంతో గుర్తింపు నిర్ధారణ కష్టంగా మారిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటన హత్యా? ఆత్మహత్యా? లేక ఇతర కారణాల వల్ల జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతుండగా, పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు. పై వివరాలకు సరిపోలే వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం ఉంటే ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను వెంటనే సంప్రదించాలని ఆయన ప్రజలను కోరారు. సమ్మక్క గుట్ట సమీపంలో లభ్యమైన ఈ గుర్తుతెలియని మృతదేహం ఘటన స్థానికంగా భయాందోళనలకు దారి తీసింది. మరణానికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం స్పష్టత రానున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల నుంచి వినతులు**

**సికింద్రాబాద్,జనవరి 08( ప్రజామంటలు) :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను గురువారం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తుకారం గేట్‌లోని ఆయన నివాసంతో పాటు పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ తనను కలిసిన వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త సంవత్సరం అందరికీ ఆనందం, ఆరోగ్యం, శ్రేయస్సును అందించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జేబీఎస్‌శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా లోతుకుంట ప్రాంతంలో హనుమాన్ దేవాలయం తొలగించాల్సి వస్తున్న నేపథ్యంలో, అక్కడి స్థానికులు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి దేవాలయ పరిరక్షణకు సహకరించాలని వినతిపెట్టారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి దేవాలయ పరిరక్షణకు అవసరమైన సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇక నియోజకవర్గ ప్రజలు అందజేసిన పలు వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే శ్రీగణేష్, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే శ్రీగణేష్ నివాసం, క్యాంపు కార్యాలయం కోలాహలంగా మారింది.



## మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఘన సన్మానం



**సికింద్రాబాద్, జనవరి 08 ( ప్రజామంటలు ) :** సికింద్రాబాద్ బన్సీలాల్ పేట డివిజన్ లోని న్యూ బోయిగూడ ఎం.ఎన్.కే. విట్టల్ సెంట్రల్ కోర్టులో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను అపార్టుమెంటు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. హనుమాన్లు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ కె. సేతు మాధవరావుతో పాటు సభ్యులు సీలం శివలింగం, ప్రభావతి, కే.వి. రమణారావు, లలిత, టి. రామచంద్రన్, ప్రమీల, రమేష్, రేణుక, రంగనాయకమ్మ, రేఖ, శారద తదితరులు పాల్గొన్నారు.

## మేడిబావి ఆర్య సమాజ్‌లో రంగోలీ పోటీలు



**సికింద్రాబాద్, జనవరి 08 ( ప్రజామంటలు) :** సంక్రాంతి పర్వదిన సంబరాల్లో భాగంగా మేడిబావి ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 11 (ఆదివారం) న మధ్యాహ్నం 2 గంటలకు ఆర్య సమాజ్ రోడ్డులో రంగోలీ పోటీ నిర్వహించనున్నట్లు సమాజ అధ్యక్షుడు ఎం.ఆర్. రవీందర్ తెలిపారు. ఈ పోటీలో సమాజ సభ్యులంతా ఉత్సాహంగా పాల్గొని, పాల్గొనేవారిని ప్రోత్సహించాలని ఆయన కోరారు. పోటీలో విజయం సాధించిన వారికి ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నట్లు రవీందర్ వెల్లడించారు.

## క్రీడలపై అవగాహనకు సీఎం కప్ టార్చ్ ర్యాలీ

**యువతలో ఉత్సాహండ ముల్కనూర్‌లో సీఎం కప్ టార్చ్ ర్యాలీ**



**భీమదేవరపల్లి జనవరి 8 (ప్రజా మంటలు) :** మండలంలోని ముల్కనూర్ నుంచి ఎల్కతుర్తి దిశగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడోత్సవాలపై అవగాహన కల్పించడం, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఈ టార్చ్ ర్యాలీ ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా అధికారులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ముల్కనూర్ ప్రధాన వీధుల గుండా సాగుతూ, భీమదేవరపల్లి మండల కేంద్రం నుండి ఎల్కతుర్తి వైపు ముందుకు కదిలింది. మార్గమధ్యంలో ప్రజలు, ఎస్ఐ రాజు టార్చ్ ర్యాలీని స్వాగతించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కప్ పోటీల ద్వారా గ్రామీణ స్థాయిలోని ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ ఉద్దేశమని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మండల, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కేంద్ర పెన్షనర్ల సమస్యలపై నేడు సిటీలో ధర్నా



**సికింద్రాబాద్, జనవరి 08 (ప్రజామంటలు) :** ఆల్ డిపార్ట్మెంట్ సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్ల సమస్యలపై ఎన్సీసీపీఏ దేశవ్యాప్త పిలుపులో భాగంగా తెలంగాణ జిల్లా స్థాయి ధర్నాను ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లో మూడు ప్రాంతాల్లో నిర్వహిం చనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ధర్నా కొనసాగనుంది. ధర్నా కేంద్రాలు సీజిహెచ్‌ఎస్ బేగంపేట్ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం (బూర్గుల రామకృష్ణ భవన్ సమీపంలో), బీఎస్ఎన్ఎల్ కొత్తపేట (ఫ్రూట్ మార్కెట్ సమీపంలో)గా నిర్ణయించారు. హైదరాబాద్, మల్కాజ్‌గిరిమెడ్చల్, రంగారెడ్డి జిల్లాల స్టేట్, సెంట్రల్ పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ ధర్నాకు అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్యదర్శి రామచంద్రుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి. వెంకటేశ్వర్ ముదిరాజ్ నేతృత్వం వహిస్తున్నారు.

## తెలంగాణ సచివాలయంలో వేముల శ్రీనివాస్‌ను కలిసిన ప్రజా ప్రతినిధులు

**భీమదేవరపల్లి గ్రామ అభివృద్ధికి సహకారం కోరిన సర్పంచ్ కుమార్ స్వామి**



**భీమదేవరపల్లి జనవరి 8 (ప్రజా మంటలు) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన సర్పంచ్ మాచర్ల కుమార్ స్వామి, ఉపసర్పంచ్ శనిగరపు అయిలయ్య గురువారం తెలంగాణ సచివాలయంలో సీఎం ఓఎస్డి వేముల శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మౌలిక వసతులు, గ్రామాభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన సమస్యలపై చర్చించగా, ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం అందిస్తామని వేముల శ్రీనివాస్ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తామని వారు పేర్కొన్నారు.

## ముత్తారం గ్రామ పంచాయతీలో తొలి గ్రామసభ



**భీమదేవరపల్లి జనవరి 8 (ప్రజా మంటలు) :** మండలంలోని ముత్తారం గ్రామపంచాయతీలో బుధవారం తొలి గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి పనులపై చర్చించి యాక్షన్ ప్లాన్ రూపొందించారు. మంచినీరు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యల పరిష్కారంపై కీలక తీర్మానాలు చేశారు. మహిళా గ్రామ సమైక్య భవన నిర్మాణానికి తీర్మానం చేయడంతో పాటు రేషన్ పంపిణీ, చెరువు నిర్వహణ అంశాలపై చర్చించారు. గ్రామ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని పాలకవర్గం హామీ ఇచ్చింది.

## ముంగిట ముగ్గులు.. ఆకాశంలో పతంగులు

**విద్యార్థులకు ఇక ఆటపాటల పండుగ!**

**సంక్రాంతి 10 నుంచి బడులకు సెలవు**

**గొల్లపల్లి జనవరి 08 ప్రజా మంటలు :** తెలంగాణలో పండుగ సంబరం పాఠశాల నుండే మొదలుకానుంది. విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సంక్రాంతి సెలవులపై విద్యాశాఖ స్పష్టతనిచ్చింది. ఈ నెల 10వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా పండుగ సెలవులు ప్రారంభం కానున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారికంగా ప్రకటించారు వరుసగా వారం రోజులు సందడే సందడి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలలకు ఈ నెల 10 (శనివారం) నుంచి 16 (శుక్రవారం) వరకు వరుసగా ఏడు రోజుల పాటు సెలవులు వర్తించనున్నాయి. పండుగ వెలుగులు, పతంగుల సందడి ముగిసిన అనంతరం జనవరి 17వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల స్కూళ్లకు. ప్రయాణాలకు సిద్ధమవుతున్న కుటుంబాలు సాధారణంగా సంక్రాంతికి హైదరాబాద్ వంటి నగరాల నుంచి పల్లెటూళ్లకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సెలవుల ప్రకటన వెలువడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ ప్రయాణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పండుగ సమయంలో విద్యార్థులు తమ సంస్కృతిని తెలుసుకుంటూ, సురక్షితంగా వేడుకలను జరుపుకోవాలని విద్యాశాఖ సూచించారు.

## శ్రీ మల్లికార్జున స్వామి అర్చక బృందం చే సన్మానం



**చిగురుమామిడి జనవరి 08.(ప్రజా మంటలు) :** తెలంగాణలో ప్రముఖ శైవ క్షేత్రం ఐన శ్రీ కొమురవెల్లి దేవాలయ అర్చక బృందం చే దేవాదాయ. ధర్మ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా దేవాలయ అర్చక. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన భవాని శివప్రసాద్ లను జరిగింది. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థాన వీరశైవ అర్చక బృందం ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్. స్థానాచారి. మల్లయ్య అర్చకులు రేవణ సిద్ధేశ్వర్. అర్చకులు మరియు ఆగమ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భోలక్‌పూర్‌లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పర్యటన



**సికింద్రాబాద్, జనవరి 8 (ప్రజా మంటలు) :** మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం భోలక్‌పూర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న ప్రజలతో ఆయన ఆత్మీయంగా మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్థానికులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, కేవలం పది నిమిషాల్లోనే ఒక యువతి బండారు దత్తాత్రేయ చిత్రపటాన్ని రూపొందించి ఆయనకు జ్ఞాపికగా అందజేసి, అందరి ప్రశంసలు పొందింది. అలాగే బీజేపీ నాయకుడు శీలం శివలింగం కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఆతిథ్యాన్ని మాజీ గవర్నర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి, కే.ఎం. కృష్ణ, ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్, ఎస్. రాజు, వై. సురేష్, టి.వి.ఎన్. రాజేష్, మహేష్ రామంచ, కే. కృష్ణ, లక్ష్మణ్, నైనెస్‌తో పాటు మహిళా నాయకులు కె. అందాలు, విద్యా మోహన్, డి. లక్ష్మి, కృష్ణనగర్ కాలనీ అధ్యక్షుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కోఆపరేటివ్ పాల డైరీని సందర్శించిన వాగ్దేవి విద్యార్థులు

**విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన కల్పిస్తున్న ఇండస్ట్రియల్ టూర్స్**

**కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి**



**భీమదేవరపల్లి జనవరి 8 (ప్రజా మంటలు) :** హుజురాబాద్ పట్టణంలోని శ్రీ వాగ్దేవి డిగ్రీ కాలేజీ బీ.కాం (సీఏ) మొదటి సంవత్సరం విద్యార్థులు తమ ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా ముల్కనూర్‌లోని ముల్కనూర్ మహిళా కోఆపరేటివ్ పాల డైరీను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల సేకరణ విధానం, శుద్ధి ప్రక్రియ, ప్యాకింగ్, సరఫరా వ్యవస్థతో పాటు వాటికి సంబంధించిన ఖర్చులు, ఆదాయాలపై సమగ్ర అవగాహన పొందారు. ఇలాంటి ఇండస్ట్రియల్ టూర్ల ద్వారా విద్యార్థులు తరగతి గది చదువులతో పాటు ప్రాక్టికల్‌గా కూడా నేర్చుకునే అవకాశం లభిస్తుందని కళాశాల కరెస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు కొలిపాక రమేష్, సంపత్ పాల్గొన్నారు.

## సమస్యల అధ్యయనానికి జాగృతి మరో 12 కమిటీలు



**హైదరాబాద్ జనవరి 08 (ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బ్లూ ప్రింట్ రూపొందించాలనే లక్ష్యంతో జాగృతి మరో 12 కమిటీలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే ప్రకటించిన 32 కమిటీలకు అదనంగా ఈ కమిటీలను జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం ప్రకటించారు. దీంతో మొత్తం కమిటీల సంఖ్య 44కి చేరింది. ఎక్స్ సర్వీస్‌మెన్, గిగ్ వర్కర్స్, జర్నలిస్టులు, వికలాంగుల సంక్షేమం, బిజినెస్/ఎంఎస్ఎంఈ, క్రీడలు, ప్రజా రవాణారోడ్లుమౌలిక వసతులు, పర్యావరణంఅటవీ, అర్బన్ ప్లానింగ్, హౌసింగ్, దేవాదాయ శాఖ (అన్ని మతాల ప్రార్థనా మందిరాలు), గ్రీన్ ఎనర్జీ రంగాలపై ఈ కమిటీలు అధ్యయనం చేయనున్నాయి. ప్రతి కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులు ఉండగా, తమ నివేదికలను ఈ నెల 17వ తేదీ లోగా స్టీరింగ్ కమిటీకి సమర్పించాలని కవిత సూచించారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించడం మనందరి భాద్యత

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




**జగిత్యాల జనవరి 8 ( ప్రజా మంటలు) :** జిల్లాలో రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో "జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం 2026" బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం 2026 బైక్ ర్యాలీని జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదన్నారు. వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్ సేఫ్టీ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది. "హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి" అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో అధికారులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)బి.ఎస్. లత, జిల్లా అధికారులు, రవాణా శాఖ, పోలీస్, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ స్థాయిల అధికారులు, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా విశ్వక్సేన ఇష్టి గణపతి అభిషేకం



**జగిత్యాల జనవరి 8 (ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన వేణుగోపాల స్వామి వారి ఆలయంలో శ్రీ ధనుర్మాస ఉత్సవ సందర్భంగా లోక కళ్యాణార్థమై భగవత్ భాగవత ఆచార్య అనుగ్రహ ప్రాప్తికై, గురువారం 8 వ రోజు నవహనీక, ఏకకుండాత్మక, విశ్వ క్షేనఇష్టి మూలమంత్ర హవనం , గణపతి అభిషేకం,జరిగింది. పూర్ణాహుతితో ఈనాటి కార్యక్రమాలు ముగిశాయి. రేపు 9 వ తేదీ శుక్రవారం శ్రీ యాగము, మహా పూర్ణాహుతి ఉంటాయని నిర్వాహకులు చిన్నస్వామి తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ నాటి కార్యక్రమంలో అర్చకులు నంబి నర్సింహా చార్యులు, ( చిన్న స్వామి ) నంబి విష్ణువర్ధనాచార్యులు, సభాపతి తిగుళ్ల సూర్యనారాయణ శర్మ, సూరజ్ శర్మ, అజయ్ శర్మ,రాధాకృష్ణ శర్మ, శ్రీరంగ వైభవ్, విష్ణు చరణ్, నవీన్ శర్మ, రాఘవ శర్మ, అజిత్ కుమార్ శర్మ, ,సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం,భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య ఎదురైన వెంటనే సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 1912 ను సంప్రదిస్తే త్వరతగతిన సమస్యని పరిష్కరిస్తాం ఏఈ. సంతోష్



**జగిత్యాల జనవరి 8 ( ప్రజా మంటలు) :** విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తైసిల్ చౌరస్తాలో 'ప్రజా బాట' కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వినియోగ దారులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై ఏఈ సంతోష్, రాంజీ నాయక్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారులు భద్రత నియమాలు పాటిస్తూ జాగ్రత్త వహించాలని, నాణ్యమైన విద్యుత్ వైర్లను వాడాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ లక్ష్యం అని, అందరికి అందుబాటులో ఉంటూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం కోసం ప్రతి విద్యుత్ ఉద్యోగి కృషి చేస్తున్నారని,వినియోగదారులకు విద్యుత్ పరంగా వార్డులోనైనా ఇంటి లోనైనా సమస్య ఎదురైన వెంటనే విద్యుత్ సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 1912 ను సంప్రదిస్తే త్వరతగతిన సమస్యని పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే విద్యుత్ వినియోగదారులు భద్రత నియమాలు పాటిస్తూ జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది ప్రమోద్, ప్రకాష్, ఉదయ్, శ్రీనివాస్, నవీన్, ఫర్ వేస్ వినియోదారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు, న్యాయవాదులకు రక్షణ కరువు

**హై కోర్ట్ న్యాయవాది వి.రఘునాథ్**




**జగిత్యాల జనవరి 8 ( ప్రజా మంటలు) :** నేడు మన దేశంలో న్యాయం కోసం ఆరాటపడే జర్నలిస్టులకు, న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని సీనియర్ హై కోర్టు న్యాయవాది వి.రఘునాథ్ అన్నారు. జగిత్యాలలో ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడారు. దేశంలో నాలుగవ స్తంభం జర్నలిస్ట్ లని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా న్యాయవాదులను, జర్నలిస్టులను చిన్న చూపు చూస్తూ ఎలాంటి హక్కులు కల్పించడం లేదన్నారు. హక్కుల సాధన కోసం ఇంకా కూడా పోరాటాలు చేసినా ఫలితాలు శూన్యం అవుతున్నాయని తెలిపారు. కలిసి కట్టుగా ఒక ప్రణాళిక బద్ధంగా జర్నలిస్టులు, న్యాయవాదులు మన హక్కుల కోసం, ప్రజల హక్కుల కోసం తెగించి కొట్లాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆయన సూచించారు. కనీసం అధికారికంగా జర్నలిస్టులకు, న్యాయవాదులకు ఒక గుర్తింపు, ఒక గౌరవం కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## శారీర దృఢత్వానికి కరాటే ఎంతో దోహదపడుతుంది

**మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇల్లెందు ప్రభాకర్**



**ఇబ్రహీంపట్నం జనవరి 8 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** శారీర దృడ త్వానికి కరాటే ఎంతో దోహదపడుతుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇల్లందు ప్రభాకర్, కస్తూర్బా గాంధీ స్కూల్ ప్రత్యేక అధికారిణి రజిత అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ రాణి లక్ష్మీబాయి ప్రసిక్షణ్ పేరుతో కరాటే కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో విద్యార్థినీలకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, కస్తూర్బా గాంధీ ప్రత్యేక అధికారిణి గురువారం ప్రారంభించగా కరాటే మాస్టర్ పసునూరి అవినాష్ ఆయా పాఠశాలల విద్యార్థినిలకు కరాటే శిక్షణను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల్లో శారీరక ధృడత్వంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించడం కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమాన్ని విద్యార్థినీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మోడల్ స్కూల్ ఇన్చార్జ్ స్వర్ణలత, కస్తూర్బా గాంధీ పీటీ సరిత ఆయా పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు

**ఫీజ్ కట్టుకంటే నాట్ ఇంట్రస్ట్ అంటున్నారు!**

**ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు నోటీసులు పంపిస్తున్న హెచ్ఎండీఏ**

**క్రమబద్ధీకరణకు సంబంధించిన 2.07 లక్షల దరఖాస్తుదారుల్లో**

**77,536 మంది మాత్రమే ఫీజు చెల్లింపు**

**చాలామందిలో తర్వాత కడదామనే ధోరణి**



**ఫీజు చెల్లించినవారు 77,536**

**ఆమోదం తెలిపిన దరఖాస్తులు 30,209**

**షార్ట్‌ఫాల్స్ గుర్తించిన దరఖాస్తుల సంఖ్య 27,470**

మహా నగరంలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి చాలా మంది ఆసక్తి చూపించడం లేదు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో ఇప్పటికే 2.07 లక్షల దరఖాస్తుదారులకు ఫీజుల చెల్లింపుపై సమాచారం అందించినా ముందుకు రావడం లేదు. 77,536 మంది మాత్రమే ఫీజులు చెల్లించారు. ఇందులో ఇప్పటివరకు 30 వేలకు పైగా దరఖాస్తులను హెచ్ఎండీఏ ఆమోదించింది. మొత్తం రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరింది.గతంలో హెచ్ఎండీఏ పరిధిలోని పంచాయతీల్లో వేలాది లేఅవుట్లు వెలిశాయి. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి, మేడ్చల్ జోన్ల పరిధిలో దాదాపు 3.42 లక్షల ప్లాట్ల క్రమబద్ధీకరణకు గతంలో దరఖాస్తులు అందాయి. వీరంతా రూ.వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఫీజులు, ఇతర ఛార్జీలు చెల్లించిన అనంతరం క్రమబద్ధీకరణ పూర్తయినట్లు ప్రొసీడింగ్స్ పత్రాలు అందించాలి. చాలామంది ఫీజుల చెల్లింపునకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం ఫీజుల చెల్లింపునకు సంబంధించి నోటీసులు జారీ చేసినా చాలామందిలో తర్వాత చూద్దామనే ధోరణి కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఇళ్ల ఇతర నిర్మాణాలు చేపట్టే పరిస్థితి లేకపోవడంతో కూడా చాలామంది వెనక్కి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎల్1 స్థాయిలో దరఖాస్తుల పరిశీలన జాప్యమూ కొంత కారణమే. దీంతో మిగతా వారు సైతం విరమించుకుంటున్నారు. విభాగాల మధ్య సమన్వయం లేక క్షేత్రస్థాయిలో ఆలస్యం జరుగుతోంది.

**హెచ్ఎండీఏ పరిధిలో ఇలా**

మొత్తం దరఖాస్తులు 3,42,816

ఫీజు సమాచారం ఇచ్చినవి 2,07,501

రాష్ట్రంలో కొంతకాలంగా పెండింగులో ఉన్న అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) చిక్కుముడులు విప్పేందుకు అధికారులు మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇటు హైకోర్టులో, అటు సుప్రీంకోర్టులో వీటిపై వ్యాజ్యాలుండడంతో నాలుగేళ్లుగా ఈ వ్యవహారం అపరిష్కృతంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలనేది ప్రభుత్వ ఆలోచన.గతంలోనే ప్రారంభమైనా ఇంకా అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో అనధికార స్థలాల క్రమబద్ధీకరణను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం 25శాతం రాయితీతో ఓటీఎస్(వన్ టైమ్ సెటిల్‌మెంట్)ను ప్రకటించింది. నిజానికి గత ప్రభుత్వం హయాంలోనే అంటే 2020లోనే ఎల్ఆర్ఎస్ పథకం ప్రారంభించింది. గతంలో మొత్తం 25,67,107 దరఖాస్తులు రాగా వాటిలో గతేడాది చివరి వరకు సుమారు 8లక్షల దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. మిగతా వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో 25% రాయితీతో ఓటీఎస్ ప్రకటించింది.లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)లో భాగంగా దరఖాస్తును తిరస్కరిస్తే ఆ తేదీ నుంచి వారం రోజులలోగా అప్పిలేట్ కమిటీకి దరఖాస్తు చేయవచ్చని టౌన్ ప్లానింగ్ రాష్ట్ర డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారు తన అప్లికేషన్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవాలంటే లింకును ఓపెన్ చేసి ఇందులో అడిగినట్లుగా దరఖాస్తు నంబరు టైప్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని చెప్పారు. అనధికార లేఅవుట్లలో 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్ట్రేషన్ అయిన స్థలాలకు ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించాలని తెలిపారు. ఒక వ్యక్తి 300 గజాలకు ఆ సమయంలో రుసుం చెల్లించి ఆ తరవాత అందులో కొంత అమ్మినా సరే ఇప్పుడు మొత్తం 300 గజాలకు పూర్తి ఫీజు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. నాడు రుసుం కట్టిన తరవాత కొంత అమ్మేశానని, అమ్మిన దానికి పూర్తి ఫీజు ఇప్పుడు చెల్లించమంటే కుదరదని ఆయన తెలిపారు.

# అర్ధరాత్రితో మూసుకున్న శ్రీవారి వైకుంఠ ద్వారం

**సర్వదర్శనానికి 15 గంటల సమయం**

**వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా శ్రీవారి హుండీకి భారీగా కానుకలు**

**మొత్తం హుండీ ఆదాయం రూ.3.48 కోట్లు**

**క్యూలైన్‌లోని భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు**



తిరుమల శ్రీవారి ఆలయంలో గతేడాది డిసెంబరు 30వ తేదీన ప్రారంభమైన పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలు గురువారం(8-01-26) అర్ధరాత్రి 12 గంటలకు ముగియనున్నాయి. వైకుంఠ ద్వారాలను మూసివేయనున్నట్లు టీటీడీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. తర్వాత సాధారణ దర్శన విధానం అమల్లోకి వస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వైకుంఠ ద్వార దర్శనాల కాల వ్యవధిలో రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ఏర్పాట్లతో భక్తులకు దర్శన సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.పది రోజుల ద్వార దర్శనాల్లో మొదటి మూడు రోజులు మాత్రం ఈ-డిప్ విధానం ద్వారా టోకెన్లు టీటీడీ జారీ చేసింది. మిగిలిన ఏడు రోజులకు నేరుగా వచ్చే సర్వదర్శనం భక్తులకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇదే సమయంలో పరిమిత సంఖ్యలో శ్రీవాణి, వీవీఐపీల బ్రేక్, రూ.300 టికెట్లు, స్థానికులకు ఈ-డిప్ విధానంలో రోజుకు ఐదు వేల చొప్పున టోకెన్లను జారీ చేసింది. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి రద్దీకి అనుగుణంగా టీటీడీ అధికారులు పర్యవేక్షించారు. క్యూలైన్‌లోని భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు అందించారు.వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా శ్రీవారి హుండీకి భారీగా కానుకలు వచ్చాయని అధికారులు తెలిపారు. శ్రీవారిని ఎనిమిదోరోజు మంగళవారం వైకుంఠ ద్వారంలో 82,022 మంది భక్తులు దర్శించుకున్నారు. మొత్తం హుండీ ఆదాయం రూ.3.48 కోట్లు వచ్చిందని ప్రకటించారు. 20,230 మంది భక్తులు మొక్కులు తీర్చుకొని తలనీలాలు సమర్పించారని తెలిపారు. అదేవిధంగా బంగారం, వెండి కానుకలు కూడా పెద్ద మొత్తంలో వచ్చాయని అధికారులు వివరించారు. వస్తు కానుకలు, భక్తులు మొక్కుల రూపంలో శ్రీవారికి విశేషంగా సమర్పించారని తెలిపారు. ఈ ఆదాయాన్ని తిరుమల అభివృద్ధి, గోశాల, విద్య , అన్నదానం, వైద్య సేవలకు వినియోగిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు. అన్నప్రసాద కేంద్రాలు, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనాన్ని కల్పించినట్లు వెల్లడించారు. తొమ్మిదో రోజు బుధవారం కూడా రద్దీ కొనసాగింది. రింగురోడ్డులోని శిలాతోరణం నుంచి భక్తులను క్యూలైన్‌లోకి అనుమతించారు. సాయంత్రానికి 51,000 మంది భక్తులు శ్రీవారిని దర్శనం చేసుకోగా క్యూలైన్‌లో వేచి ఉన్న మిగిలిన భక్తులకు 15 గంటల్లో దర్శనం పూర్తికానుందని టీటీడీ ప్రకటించింది.అయితే నిన్న(7-01-26) మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ కూడా సతీసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, మంత్రి ఆనం ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆయన స్వామివారి తీర్థప్రసాదాలను అందుకున్నారు. అంతేకాకుండా పండితులు ధరమ్ బీర్ గోకుల్‌కు వేదాశీర్వచనం అందజేశారు. అంతేకాకుండా అద్దేరోజు వేర్వేరు సమయాల్లో సినీ నటీమణులు మీనాక్ష చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లు దర్శించుకున్నారు. దర్శన సమయంలో వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. మీనాక్ష చౌదరి, ఐశ్వర్య రాజేశ్?లు వెంకన్నను దర్శించుకొని మ్నెక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం వైకుంఠ ఉత్తర ద్వార ప్రవేశం చేశారు. మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# ఫొటో దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయడమే మన పని

**చెత్త సంగతి మనకెందుకులే!**

**జీహెచ్ఎంసీలో ఫలితం లేని శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్**

**ప్రతి డివిజన్‌కు ఓ ప్రత్యేక అధికారి నియామకం**

**రోజూ ఒక ఫొటో దిగడం యాప్‌లో అప్‌లోడ్ చేసి**

**మమ అనిపిస్తున్న అధికారులు**



రాజధాని హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ఆల్విన్ కాలనీ రెండో ఫేజ్‌లోని ఓ ఖాళీ స్థలం ముందు చెత్త కుప్పను తయారు చేశారు. దాన్ని తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని స్థానికులు కోరితే, వారు నానా రభస చేసి ఘర్షణకు దిగారు. చెత్తను కాలనీవాసులే పడేశారని, వారే తొలగించాలని తీవ్ర వాగ్వాదానికి దిగారు.గత నెల డిసెంబరు 31 నుంచి జీహెచ్ఎంసీ, విలీన మున్సిపాలిటీలు కలిపి 300 డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించాలని బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. దీని కోసం గ్రేటర్‌లో ప్రతి డివిజన్‌కు ఓ ప్రత్యేక అధికారిని కూడా నియమించారు. ఆయా డీసీలు, జోనల్ కమిషనర్లు, ఇటీవల నియమితులైన అదనపు కమిషనర్లు ఈ శానిటేషన్ ప్రక్రియను పర్యవేక్షించాల్సి ఉంది. డివిజన్లలో రోజూ ఒక ఫొటో దిగడం, యాప్‌లో అప్‌లోడ్ చేయడం, మమ అనిపించడం ఇప్పుడు సర్వ సాధారణంగా మారింది. దీని కారణంగా హైదరాబాద్ నగరంలో ఎక్కడ చెత్త అక్కడే ఉంటోంది.

**అసలు ఏం చేయాలి? ఎలా చేస్తున్నారు**

హైదరాబాద్‌లో ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్త సేకరించాలి. అందుకు ఇంటికి యూజర్ ఛార్జీల కింద రూ.100, రూ.150 చొప్పున చెత్త సేకరించే వారికి చెల్లిస్తున్నారు. కానీ తడి పొడి వేరు చేసే పరిస్థితి మాత్రం లేదు.ఇలా సేకరించిన చెత్త స్టేజ్-1 ట్రాన్స్‌ఫాం స్టేషన్ వద్ద అన్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి పెద్ద పెద్ద వాహనాల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇక్కడ కొంత తడి పొడి చెత్తను వేరు చేస్తారు. జవహర్‌నగర్‌లో సేకరించిన చెత్త కొండల్లా పేరుకుపోతోంది. ప్రస్తుతం నగరంలోని 300 డివిజన్ల నుంచి 9500 టన్నుల చెత్త వస్తుందని అంచనా.ట్రాన్స్‌ఫామ్ స్టేషన్ వద్ద ఉదాసీనంగా చెత్త ఏరుకొనే వ్యక్తులకు అవకాశం ఇస్తారు. వారు ఇక్కడి నుంచి ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకెళ్తారు.

**చెత్తాచెదారంతో వరాహాల స్వైర విహారం**

పైన చిత్రాన్ని చూశారా : ఇది సికింద్రాబాద్ బోయినపల్లి మార్కెట్ సమీపంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు కనిపించిన చిత్రం. చెత్తా చెదారంతో ఉన్న స్థలంలో వరాహాల స్వైర విహారం కనిపించింది. ఇక్కడ రెండు మూడు రోజులుగా చెత్తను తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు. ఇదొక్కటే కాదు, ఇలాంటి దృశ్యాలు నగరం మొత్తం మీద చాలా చోట్లనే కనిపించాయి. ఈటీవీ-ఈటీవీ భారత్ బృందం ప్రత్యేక పరిశీలనలో నగరంలోని పారిశుద్ధ్యంపై పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. చాంద్రాయణగుట్ట, ఖిల్వత్ మైదానం, చాదర్‌ఘాట్ వంతెన, జుమ్మెరాత్ బజార్, చిలుకానగర్, పార్శిగుట్ట, గుడిమల్కాపూర్, బృందావన్ కాలనీల్లో 'ఈటీవీ- ఈటీవీ భారత్ణ బృందం పర్యటించింది. పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమంలో బహిరంగంగా ఈ డొల్లతనం వెలుగు చూసింది. దీని ప్రకారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది శానిటేషన్ విషయంలో మమ అనిపిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుంది. హైదరాబాద్ నగరంలో దాదాపు 40 లక్షల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పీటీఐ (ఆస్తి పన్ను) లెక్కల ప్రకారం మొత్తం 27 లక్షల ఇళ్లు ఉన్నాయి. అనధికారిక ఇళ్లు కూడా ఉన్నాయి. ప్రతి ఇంటి నుంచి యూజర్ ఛార్జీల పేరుతో చెత్త సేకరించే కార్మికులకు సగటున రూ.100 చొప్పున ఏకంగా రూ.40 కోట్లు చెల్లిస్తున్నారు. అయినా రహదారులపై చెత్త మాత్రం మాయం కావడం లేదు. మరోవైపు ప్రతి ఏటా జీహెచ్ఎంసీ కేవలం పారిశుద్ధ్యానికే రూ.600 కోట్ల వరకు కేటాయిస్తోంది. దీనిలో 50 శాతం సిబ్బంది జీత భత్యాలకే చెల్లిస్తోంది. ఇంత చేస్తున్నా, నగరవాసులకు దోమల బెడద మాత్రం తప్పడం లేదు.



# సంక్రాంతి ముంగిట పొంచి ఉన్న వాయు'గండం'

**పోర్టులకు తుపాను హెచ్చరిక**

**నైరుతి ఆగ్నేయ బంగాళాఖాతం మధ్య తీవ్ర వాయుగుండం**

**రేపు తమిళనాడు, కేరళకు భారీ వర్ష సూచనలు, ఆరెంజ్ అలెర్ట్ జారీ**

**ఆంధ్రప్రదేశ్ దక్షణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో**

**అక్కడక్కడ మోస్తరు వర్ష సూచనలు**



నైరుతి ఆగ్నేయ బంగాళాఖాతం మధ్య తీవ్ర వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు. ఇది శ్రీలంకలోని పోట్స్‌విల్‌కు తూర్పు ఆగ్నేయంగా 420 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. హంబన్‌టోటాకు తూర్పు ఆగ్నేయంగా 470 కి.మీ. దూరంలో, త్రికోమలికి ఆగ్నేయంగా 570 కిలోమీటర్ల దూరంలో ఉండగా, చెన్నైకి దక్షణ ఆగ్నేయంగా 1,020 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. ఈ తీవ్రవాయుగుండం గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతుంది. ఇదే వేగంతో 36 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదిలి తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.శ్రీలంకలోని హంబన్‌టోటా-కల్ మున్నాయ్ మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రేపు తమిళనాడు, కేరళకు భారీ వర్ష సూచనలు ఉన్నాయి. ఆ రాష్ట్రాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. రేపు ఆంధ్రప్రదేశ్ దక్షణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ నిపుణులు తెలుపు తున్నారు.సంక్రాంతి ముంగిట దక్షణాది రాష్ట్రాలకు వాయు'గండం' పొంచి ఉందని వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు. పరిస్థితులు అనుకూలిస్తే ఇది తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో భూమధ్యరేఖ సమీపంలో తీవ్ర అల్పపీడనం బుధవారం ఉదయానికి వాయుగుండంగా బలపడిందని వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు. సాయంత్రానికి ఇది పొట్టువిల్ (శ్రీలంక)కు 570 కిలోమీటర్లు, బట్టికోలా (శ్రీలంక)కు 620 కి.మీ., కరైకల్ (తమిళనాడు)కు 990 కి.మీ., చెన్నైకి 1,140 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది.గురువారానికి తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. తర్వాత 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతుందని భావిస్తున్నారు. దీని ప్రభావంతో శుక్ర, శని, ఆదివారాల్లో శ్రీలంక, తమిళనాడులో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా. శని, ఆదివారాల్లో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. వాయుగుండం నేపథ్యంలో విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం, గంగవరం, కాకినాడ పోర్టులకు తుపాను హెచ్చరికల కేంద్రం ఒకటో నంబరు హెచ్చరికలు జారీ చేసింది.సాధారణంగా డిసెంబరు 31 నాటికి ఈశాన్య రుతుపవనాల సీజన్ ముగుస్తుంది. వాతావరణ శాస్త్రం ప్రకారం బంగాళాఖాతంలో మిగిలిన నెలలతో పోలిస్తే జనవరి, ఫిబ్రవరిల్లో వాయుగుండాలు, తుపాన్లు చాలా తక్కువగా ఏర్పడతాయి. 1891-2024 మధ్యలో రెండు తీవ్ర తుపాన్లు, ఆరు తుపాన్లు, 12 వాయుగుండాలు ఏర్పడ్డాయి. వాటిలో అధిక శాతం శ్రీలంకలోనే తీరం దాటాయి. మూడు వాయుగుండాలు మినహా మిగిలినవన్నీ సంక్రాంతికి ముందే ఏర్పడటం గమనార్హం. వాటిలో ఒక తుపాను మాత్రమే ఏపీలో తీరం దాటింది.

# ఆసుపత్రికి వెళ్దామంటే నమ్మి వెళ్లారు

**నాన్నే ఇలా ఉసురు తీస్తాడనుకోలేదు**

**రెండేళ్ల క్రితం భార్యతో శివరాములుకు విడాకులు**

**అప్పట్నుంచి తండ్రి దగ్గరే ఉంటున్న ఇద్దరు పిల్లలు**

**పొలం దగ్గరికి పిల్లలిద్దర్నీ తీసుకెళ్లి ఉరేసి చంపిన తండ్రి**



భార్య విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. ఇక ఆమె రాదన్న విషయం తేలిపోయింది. ఇద్దరు పిల్లలకు అన్నీతానై ఆలనా పాలనా చూసే బాధ్యత తండ్రిపై పడింది. తానూ ఆ పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుతు న్నాడు. తల్లిలేని లోటు తెలియ కుండా పిల్లల్ని చూసుకుం టున్నాడు. కానీ ఓ రోజు హఠాత్తుగా ఇద్దరు పిల్లలతో పాటు తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. అసలు ఏం జరిగింది? గుండెల్ని పిండేసిన ఈ ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరులో చోటు చోసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం, నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేర్ గ్రామానికి చెందిన శివరాములుకు ఊట్కూరు మండలం పెద్దజట్రం గ్రామానికి చెందిన సుజాతతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఎనిమిదేళ్ల కుమార్తె రితిక, ఆరేళ్ల కుమారుడు చైతన్య ఉన్నారు. వివాహమైన వెంటనే శివరాములు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు.

**పిల్లల్ని చంపి తానూ ఆత్మహత్య చేసుకున్న తండ్రి**

మనస్పర్థలతో విడిపోయిన జంట : చైతన్య జన్మించక ముందు నుంచే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. తరచూ గొడవలతో కుమారుడికి మూడు నెలల వయసున్నప్పుడే భర్తను వదిలేసి సుజాత పుట్టింటికి వెళ్లింది. ఆ తర్వాత శివరాములు హైదరాబాద్ నుంచి స్వగ్రామం వచ్చాడు. నాటి నుంచి పిల్లలు తండ్రి వద్దే పెరుగుతున్నారు. పిల్లలకు అమ్మలేని లోటు తెలియనీయకుండా చూసుకునే వాడు. రాత్రి వేళల్లో పొలం వద్దకు పిల్లలను తీసుకెళ్లి నిద్రించే వాడు. గత ఏడాది మార్చిలో భార్యాభర్తలు కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి శివరాములు ఇంట్లో ముభావంగా ఉండేవాడు.ఇటీవల రితికకు దద్దుర్లు రావడంతో సాయంత్రం ఆసుపత్రికి తీసుకువెళ్తున్నా అంటూ ఇద్దరు పిల్లలను శివరాములు పొలం వద్దకు తీసుకెళ్లాడు. రాత్రి 9 దాటినా ఆసుపత్రికి వెళ్లిన వారు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేయగా, మరికల్‌లో ఉన్నట్లు చెప్పాడు. కానీ కొంతసేపటికి అసలు విషయం తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యారు. పిల్లలిద్దర్నీ తండ్రి చంపినట్లు తెలుసుకున్నారు."రాత్రి 9 గంటలకు బయలుదేరాడు. పిల్లలను ఆసుపత్రిలో చూపించుకొని వస్తారు కదా అని ఇంటివారు తిని పడుకున్నారు. పది, పదకొండు అయింది. ఇంకా రాలేదు. వారి ఇంట్లో అవ్వ, తాత, చిన్నమ్మ, చిన్ననాన్న ఉన్నారు. ఎప్పుడన్నా ఏడిస్తే కూడా ఆ పిల్లల్ని మేము చూసుకునే వాళ్లం. పొలం వద్ద గుడిసెలో పిల్లలు గాఢనిద్రలో ఉన్న సమయంలో తాడుతో ఉరివేసి చంపిన శివరాములు, సమీపంలోని యాపల్‌చెర్వు వంపు వాగు కల్వర్టులో వారిద్దర్నీ పడేశాడు. ఆ తర్వాత తానూ చనిపోయేందుకు పలు ప్రయత్నాలు చేశాడు. అనంతరం తాను చనిపోయేందుకు గడ్డి మందు తాగాడు. వెంటనే చనిపోవాలని కరెంట్ తీగను పట్టుకున్నాడు. షాక్ కొట్టడంతో ఫ్యూజు ఎగిరిపోయింది. తన జేబులో ఉన్న బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. అప్పటికి మరణించకపోవడం, గడ్డి మందుతో కడుపులో మంట రావడంతో తాళలేక ఈ విషయాన్ని స్నేహితులకు ఫోన్‌లో చెప్పాడు.వారు వెంటనే పొలం దగ్గరకు వెళ్లి చూసి గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. యాపల్‌చెరువు వంపు వాగు కాలువలో వెతకగా పిల్లల మృతదేహాలు లభించాయి. శివరాములును ఆసుపత్రికి తరలించగా హైదరాబాద్‌లోని ఉస్మానియాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పిల్లలను ఉరేసి చంపాడా నీటిలో ముంచి చంపాడా అనే విషయం పోస్టుమార్టం నివేదికలో తెలుస్తుందని సీఐ రాజేందర్ రెడ్డి తెలిపారు."శివరాములు తన భార్యతో ఆరు ఏళ్లుగా విడిపోయి ఉండటంతో రెండేళ్ల కింద వాళ్లకు విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి తనే పిల్లల్ని పెంచి, పోషిస్తున్నాడు. ఆ చిన్నారులను పోషించడం ఇబ్బందిగా మారడం, తర్వాత భార్య లేకుండా ఉండటం ఇలా జీవితం మీద విరక్తి చెంది వాళ్ల ఇద్దరు పిల్లల్ని తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇద్దరికీ గొంతుకు తాడు బిగించి చంపేశాడు. ఆ తర్వాత తానూ ఆత్మహత్యాయత్నం చేశాడు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com